క్లుప్తంగా

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న స్వామివారు

బలిజిపేట: చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రోహిణీ నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కె.రాంబాబు స్వామివారిని తులసీ దళాలు, పూలతో అలంకరించారు. భక్తులు అందించిన పూజాద్రవ్యాలు, దూప, దీప, నైవేద్యాలతో స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అన్నసమారాధన



భక్తులకు ప్రసాదాన్ని వడ్డిస్తున్న రంగునాయుడు

మక్కువ: మండల కేంద్రం మక్కువలోని నాయుడువీధిలో ఆదివారం అయ్యప్పస్వామి మాలధారణ భక్తులు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప భక్తులు ముందుగా సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరించారు. పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

వాహనాల తనిఖీ



వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎస్సై వెంకటరమణ

మక్కువ: మండల కేంద్రంలో మక్కువ, దుగ్గేరు, శంబర గ్రామాల కూడలి వద్ద ఎస్సై వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఏజెన్సీ గ్రామాల నుంచి రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని నిలిపి క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన వాహన పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. రహదారి భద్రత నిబంధనలపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి, లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని సూచించారు. మైనర్లకు వాహనాలు నడిపించేందుకు ఇచ్చేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటు తగదు

పార్వతీపురం: విద్యుత్ వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించడం హేయమైన చర్య అని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మీనాయుడు అన్నా రు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దశల వారీగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి రెండు కోట్లమంది వినియోగదారులపై భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. వ్యవసాయ పంపుసెట్లు, వ్యాపార సంస్థలకు, నివాస గృహాలకు మీటర్లు బిగించడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీట ర్లు బిగిస్తే బద్దలు కొట్టండని అప్పట్లో టీడీపీ పిలుపునిచ్చిందని, ఆ నాటి మాటలు ఏవిధంగా ఉన్నాయో ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

స్థల పరిశీలన



కాట్రగడ ఓపెన్ హెడ్ చానల్ వద్ద ఇసుక ర్యాంప్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భామిని: మండలంలోని వంశధార ఓపెన్ హెడ్ చానల్ వద్ద (కాట్రగడ - బి) ఇసుక ర్యాంప్ నిర్వహణకు అనువైన స్థలాన్ని అధికారులు ఆదివారం పరిశీలించారు. వంశధార ప్రాజెక్ డీఈఈ భవానీశంకర్, ఏఈ జగదీష్, మైన్స్ ఆర్ఐ, మండల సర్వేయర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వంశధార తీరంలో ఇసుక లభ్యతపై ఆరా తీశారు. సైడ్ వియ్యర్ నుంచి ఎస్కేప్ కెనాల్‌లో పేరుకుపోయిన ఇసుక మేటలను తీయించడానికి అనువైన స్థలం గుర్తించినట్లు వంశధార ఇంజినీర్లు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నది ఆవల గల ఒడిశా ప్రాంతాలకు ఇబ్బంది లేకుండా ర్యాంప్ నిర్వహణకు స్థలం ఎంపిక చేశామన్నారు.

ఒక్క క్లిక్‌తో సస్యరక్షణ

- పంట తెగుళ్ల గుర్తింపునకు ఎన్‌పీఎస్ఎస్ యాప్
- అరచేతిలో సమగ్ర సస్యరక్షణ వివరాలు
- ఫోన్‌లోనే నిపుణుల సూచనలు, సలహాలు

పార్వతీపురంటౌన్:

చీడపీడలు, తెగుళ్ల వ్యవసాయ ఉత్పాదకతపై భారీ ప్రభావాన్ని చూపుతున్నాయి. పంటలను ఆశించే వివిధ రకాల చీడపీడల నివారణకు రసాయన మందులను అధిక మోతాదుల్లో వినియోగించడం వల్ల సాగు ఖర్చు పెరగడంతో పాటు అనారోగ్యానికి, పర్యావరణానికి హాని కలుగుతుంది. పంటలను ఆశించే తెగుళ్లను గుర్తించేందుకు, సరైన సస్యరక్షణ పద్ధతులు అనుసరించేలా రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్ఎస్) యాప్‌ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ యాప్ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడింది. కేవలం కొన్ని క్లిక్‌లతో పంటలను ఆశించే వివిధ రకాల తెగుళ్లు, చీడపీడలను సులభంగా గుర్తించవచ్చు. సస్యరక్షణకు అవసరమైన సలహాలు, సూచనలను నిపుణుల నుంచి రైతులు నేరుగా తెలుసుకోవచ్చు. వారి సూచనలు పాటించడం ద్వారా పంట ఉత్పాదకతను పెంచుకోవచ్చు.



గుగూల్ ప్లేస్టోర్‌లో ఎన్‌పీఎస్ఎస్ యాప్

ఎన్‌పీఎస్ఎస్ యాప్ పనితీరు ఇలా..

గూగుల్ ప్లే స్టోర్, ఐఓఎస్ స్టోర్‌లో ఎన్‌పీఎస్ఎస్ అని టైప్ చేసిన వెంటనే ఈ యాప్ కనిపిస్తుంది. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఈ యాప్ ద్వారా రైతులు పంట తెగుళ్లను సులభంగా గుర్తించవచ్చు. తద్వారా ఏది మిత్ర కీటకమో, శత్రు కీటకమో సులభంగా తెలుసుకోవచ్చు. గుర్తించిన పురుగు, తెగులుకు సంబంధించిన సస్యసంరక్షణ సమాచారాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా త్వరితగతిన అందుకోగలరు. రైతులు వారి పొలంలో ఉన్న చీడపీడల సమాచారాన్ని ఈ యాప్‌లో ఎంటర్ చేసినట్లయితే, తద్వారా సస్యసంరక్షణ అధికార యంత్రాంగం అప్రమత్తమై, ఆ ప్రాంతంలో చీడపీడల గురించి సర్వే చేసి, అసలైన చీడపీడల ఉధృతిని గమనించి ఆ ప్రాంతంలో గల రైతులందరికీ సమగ్ర సస్యసంరక్షణ సమాచారాన్ని అందించి, అప్రమత్తం చేస్తారు. రైతులందరికీ ఈ ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ని వాడుకలోకి తీసుకొచ్చే విధంగా వ్యవసాయశాఖ అవగాహన కల్పిస్తున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. పంటలను ఆశించే వివిధ రకాల చీడపీడలకు నివారణకు సంబంధించి వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచనలు సలహాలు అందజేస్తారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకునేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. రైతులు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– అశోక్, మండల వ్యవసాయాధికారి, పార్వతీపురం

హామీలు అమలు చేయకపోతే ప్రజాపోరాటం తప్పదు

- ప్రభుత్వాన్ని హెచ్చరించిన సీపీఎం నాయకులు

సాలూరు: టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే భవిష్యత్‌లో ప్రజలతో కలిసి పోరాటాలకు సిద్ధమవుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వేణు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత రాజకీయాలకు పాల్పడుతూ.. అభివృద్ధిని పక్కన పెట్టేస్తున్నాయని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని, సాలూరు మండలంలో మూతపడిన జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీని తక్షణమే తెరిపించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో రైతుబజారును వాడుకలోకి తీసుకురావాలని, ప్రభుత్వ ఐటీఐ,



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వేణు

ప్రభుత్వ లైబ్రరీకి స్థలాలు కేటాయించి భవనాలు నిర్మించాలని, ఆశ్రమ ఉన్నత పాఠశాలను వెంటనే ప్రారంభించాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరాటం చేయాలని తీర్మానం చేశారు. సీపీఎం నాయకుడు ఎన్.వై.నాయుడు, మరో ఏడుగురితో పట్టణ నూతన కమిటీ కొలువుదీరింది. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకటరావు పాల్గొన్నారు.

గోగు రైతులను ఆదుకోవాలి



దయానిధిపురం పొలాల్లో నిల్వ చేసిన గోగు పంట

సీతానగరం: జనపనార ఆధారిత వస్తువుల తయారీకి ప్రభుత్వం చేయూత ఇవ్వడం ద్వారా గోగు సాగును ప్రోత్సహించాలని గోగు రైతులు కోరుతున్నారు. మండలంలోని గాదెలవలస, జానుమల్లువలస, ఎస్.ఎస్.పురం, కె.ఎస్.పురం, దయానిధిపురం, జయంతిరాయపురం, చినంకలాం, తదితర గ్రామాల్లో గోగు పంట సాగు చేస్తున్నారు. పంట కోత అనంతరం నార తీసేందుకు చెరువుల్లో ఊర వేయాల్సి ఉంటుంది. అయితే ఆయా గ్రామాల్లోని చెరువుల్లో నీరు లేకపోవడం, గోగుసాగుకు మద్దతు ధర రాకపోవడంతో రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం స్పందించి గోగు సాగుకు మద్దతు ధర ప్రకటించి ప్రోత్సహించాలని, గోగు ఉత్పత్తులైన సంచులు, చేతి సంచులు, మోకు తాళ్లు వంటి వాటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

రాళ్లుతేలిన రోడ్డు

సీతానగరం: మండలంలోని ఏగోటివలస–దయానిధిపురం–గాదెలవల్స బీటీ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏగోటివలస నుంచి గాదెలవలస వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.1.27 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే అలజంగి జోగారావు భూమిపూజ చేసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి మూడు లేయర్లు మెటల్ వేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా ఇంత వరకు పనులు తిరిగి ప్రారంభం కాలేదు. వేసిన



మెటల్ పైకి తేలడంతో అధ్వానంగా మారిన ఏగోటివలస-గాదెలవలస రోడ్డు

మెటల్ పైకి తేలడంతో ఈ రోడ్డులో రాకపోకలకు సాగించేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బీటీ రోడ్డు పనులు పూర్తిచేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



పార్వతీపురం: బంకపల్లి ములగలో అయ్యప్ప పూజల్లో పాల్గొన్న స్వాములు



సీతానగరం: శరణఘోష ఆలపిస్తున్న అయ్యప్ప భక్తులు

పార్వతీపురం: మండలంలోని బంకపల్లి ములగ గ్రామంలో అయ్యప్ప మాలధారణ భక్తులు ఆదివారం అయ్యప్ప పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని బంకపల్లి తిరుపతిరావు ఇంట్లో 18 మెట్లతో మండపం ఏర్పాటు చేసి అయ్యప్పకు ప్రత్యేక పూజలు చేశారు. భజన గీతాలు ఆలపించారు.

సీతానగరం: మండల కేంద్రంలోని కోట సత్యనారాయణ ఇంట్లో గురుస్వామి ఇసాయి రమణ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ భక్తులు శనివారం రాత్రి పడిపూజ నిర్వహించారు. అరటిడొప్పలతో 18 మెట్లు నిర్మించారు. మెట్టుమెట్టుకు జ్యోతిని వెలిగించి మణికంఠ స్వామికి పూజలు చేశారు. అనంతరం అయ్యప్పలు బిక్ష ఆరగించారు. గురుస్వామి రమణ మాట్లాడుతూ 41 రోజుల పాటు నియమనిష్టలతో అయ్యప్ప దీక్ష చేస్తున్నట్లు చెప్పారు.

కార్తీక వనభోజనాలు



జోగింపేట తోటలో పాత్రికేయుల సందడి

సీతానగరం: మండలంలోని గుచ్చిమి, జోగింపేట, చిన్నారాయుడుపేట, తదతర గ్రామాల్లోని మామిడి తోటల్లో ఆదివారం కార్తీక వనభోజనాల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. చిన్నారులు, పెద్దలు అంతా కలిసి ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

ఘనంగా కోత పండుగ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని రావాడ రోడ్డు జంక్షన్ సమీపంలో ఉన్న గుడ్ సమారిటన్ లూథరన్ చర్చిలో ఆదివారం కోత పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ డి.రాజు బైబిల్‌లో కోత పండుగకు సంబంధించిన వాక్యాలను వినిపించారు. దేవుడు చేయుచున్న మేలుకు కృతజ్ఞతగా ప్రథమ ఫలములు ఆయనకు అర్పిస్తూ ఈ పండుగను చేసుకుంటారని తెలిపారు. సమస్త శ్రేయస్సు నిమిత్తం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

సంఘస్తులలందరి పేర్లతో లక్కీ డ్రా తీసి విజేతలకు బైబుల్, చీరలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు డి.రాజారత్నం, డి.ప్రదీప్, కె.సుదర్శన్, డి.విజయ్‌కుమార్, డి.జాన్ తదితరులు పాల్గొన్నారు.

బడిదేవర కొండ సమస్యపై కార్యాచరణతో ముందుకు వెళ్తాం



గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: బడిదేవర కొండ సమస్యపై కార్యచరణతో ముందుకు వెళ్తామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని గంగాపురం పంచాయతీ, తాన్నవలస గిరిజన గ్రామాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. గ్రామంలో ఉన్న గిరిజనుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. బడిదేవర కొండపై తవ్వకాలు మళ్లీ మొదలు పెట్టడంతో తమ బతుకులు ఛిద్రం అవుతాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు ఉండగా తవ్వకాలు ఎలా చేస్తారన్నారు. దీనిపై స్పందించిన జోగారావు తప్పకుండా మీ అందరి అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని ఈ సమస్యపై ఒక కార్యాచరణతో ముందుకు వెళ్తామన్నారు. ఈ సమస్యపై పోరాడే అన్ని వర్గాలతో కలిసి నడిచేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రజలకు న్యాయం జరిగేలా చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, వైస్ ఎంపీపీ ఎస్.జగన్నాథం, సర్పంచ్‌లు వెంకయ్య, శ్రీరాములు, వై.తిరుపతిరావు, స్థానిక పెద్దలు, యువత పాల్గొన్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి

పార్వతీపురంటౌన్: రహదారి భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని పట్టణ సీఐ నారాయణరావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఎఫ్‌ఓబీ వద్ద పోలీసుల ఆధ్వర్యంలో రహదారి భద్రతపై ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలు కచ్చితంగా తెలుసుకోవాలని, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. పట్టణంలోని ముఖ్య కూడళ్ల వద్ద ఆటోలను క్రమపద్ధతిలో నిలపాలని సూచించారు. ఆర్టీసీ కాంప్లెక్స్, పాత బస్టాండ్, సౌందర్య జంక్షన్, బెలగాం వద్ద ఆటోలను అస్తవ్యస్తంగా నిలపడం వల్ల ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించవద్దని, డ్రైవర్ సీటులో ప్రయాణికులను కూర్చోబెట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో పట్టణం ఎస్ఐ గోవింద్, ట్రాఫిక్ ఎస్ఐ పాపయ్య, ట్రాఫిక్, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణరావు

విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరుబాట

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్

పార్వతీపురంటౌన్: విద్యా వ్యవస్థ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా విద్యార్థులు పోరు సాగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనం ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువగలం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలల గడుస్తున్నా ఇంతవరకు విద్యార్థులకు ఏం న్యాయం చేశారని ప్రశ్నించారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విద్యా, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు హరికృష్ణ, దుర్గాప్రసాద్, మణి, సాయికుమార్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం

పార్వతీపురంటౌన్: కేంద్రంలోని బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, వ్యవసాయ, కార్మిక, గిరిజన వ్యతిరేక విధానాలపై శంఖారావం పూరించడం జరుగుతుందని పలువురు రైతు, కార్మిక, వ్యవసాయ, గిరిజన సంఘాల నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలోని రైతుకూలీ సంఘం కార్యాలయంలో ఆదివారం సమన్వయ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనునాయుడు మాట్లాడుతూ.. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలుచేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రక్రియను నిలిపివేయాలని, లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పనులకు రోజుకు రూ.600లు వేతనం ఇవ్వాలని, 200 రోజులు పని కల్పించాలని, ఉపాధిహామీ పనులు పట్టణాలకు విస్తరించాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 24న పాలకొండ నుంచి వీరఘట్టం, జియమ్మవలస, మేరంగి, ఖడ్గవలస, పార్వతీపురం మీదుగా సీతానగరం వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. 26న పార్వతీపురం పాత బస్టాండ్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌కేఎం జిల్లా అధ్యక్షుడు బంటు దాసు, ఏపీ రైతు సంఘం నాయకులు బడితి అప్పలనాయుడు, సీఐటీయూ నాయకులు వై.మన్మథరావు, ఏఐటీ యూసీ, నాయకులు టి.జీవ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, గంగునాయుడు, సూరయ్య, అయ్యార్ల సంఘం నాయకులు, పి.సంగం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్‌కుమార్, చెరువుల సంరక్షణ సమితి నాయకులు వంగల దళినాయుడు, విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీను

నేడు కుంబిడి యాత్ర..

- ప్రతి ఏడాదీ కార్తీకమాసం మూడో సోమవారం సందడే సందడి
- అశేషంగా తరలిరానున్న భక్తులు
- జాతరకు ముమ్మర ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

వీరఘట్టం: మండలంలోని కుంబిడి – ఇచ్ఛాపురం గిరిజన గ్రామంలో కార్తీక మూడో సోమవారం జరగనున్న కుంభేశ్వరుని (ఉమామహేశ్వరస్వామి) యాత్రకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం బారికేడ్లను ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా కుంబిడి యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అశేషంగా భక్తులు వచ్చి ఆ మహాశివున్ని దర్శించుకుంటారు. ఈ ఏడాది స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. అలాగే భక్తులకు అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేయనున్నారు.

ఇదీ కుంబిడి ప్రత్యేకత...

కార్తీకమాసం మూడో సోమవారం కుంబిడిలో వెలసిన కుంభేశ్వరునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి రోజంతా అక్కడే గడిపి వన భోజనాలు చేసి సాయంత్రం తిరిగి రావడం ఆనవాయితీగా వస్తోంది. ఒక్క ఈ మండలమే కాకుండా పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలోని వంగర, పాలకొండ, రేగిడి, సీతంపేట, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, పార్వతీపురం, తదితర మండలాల నుంచి తండోపతండాలుగా భక్తులు వస్తారు. ఈ ప్రాంతంలో ఇదే పెద్ద జాతర కావడం విశేషం.

ఇదీ నేపథ్యం..

పూర్వం దట్టమైన అటవీ ప్రాంతంలో (కుంబి ఇచ్ఛాపురం) అనాగరికంగా జీవించే గిరిజనులు వేటకు వెళ్లినప్పుడు శివలింగం వారికి తారసపడింది. ఏదో కొండదేవత విగ్రహం అనుకొని దానికి పూజలు, జంతుబలులు చేసేవారని పూర్వీకుల సమాచారం. ఒకనాడు వీరఘట్టానికి చెందిన శీలా సోమలింగం అనే వ్యక్తి ఆ గిరిజన గ్రామానికి యాచనకు వెళ్లినప్పుడు గిరిజనులు శివలింగానికి జంతు బలులుతో పూజలు చేయడం చూసి జంతుబలులు ఇవ్వడం తప్పని చెప్పినట్లు కథనం. శివలింగానికి పువ్వులు, పసుపు, కుంకుమలతో నిత్యం పూజలు చేయాలని వారికి సూచించడంతో అప్పటి నుంచి సంప్రదాయ పూజలు జరుగుతున్నాయి. కాలక్రమంలో ఆ శివలింగాన్ని కుంభేశ్వరుడిగా పిలుచుకుంటూ పూజలు చేస్తున్నారు. అలాగే ఎండల మల్లేశ్వరుడిగా కూడా పిలుస్తుంటారు.

పవిత్రతను కాపాడండి...

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కుంబిడి పవిత్రను కాపాడాలని ఎస్సై జి. కళాధర్ కోరారు. యాత్రా ప్రాంగణాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలో మద్యం, మాంసం విక్రయాలు చేపట్టరాదని సూచించారు.



కుంబిడిలో వెలిసిన కుంభేశ్వరుడు